

# కథా కౌముది

## నమ్మకం

స్వాతీ శ్రీపాద



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
సాధారణ ప్రచురణ కథ

వాలుకుర్చీలో సాగిలపడి కాళ్ళు ముడుచుకు ఆలోచిస్తున్నాడు శంకరశాస్త్రి. లోపల శకుంతల ఏదో పనిలో ఉన్నట్టుంది.

సగం ఇల్లు పంచుకున్న కొడుకు సుబ్బు వారానికో ఒకసారి వచ్చి పలకరిస్తాడు. అదీ మంచీ చెడు కాదు.

" మందులు వేళకు తెచ్చి వేసుకోండి. రోగం ముదరబెట్టుకుంటే మళ్ళీ మనమే పరుగెత్తాలి. వందల్తో పోయేది వేలకు వస్తుంది." అది అభిమానమో, హెచ్చరికో తెలియని స్వరంలో చెప్తాడు. లోపలకు దూరి తల్లితో గుసగుసలాడతాడు. కన్న పేగు గనక ఆ తల్లి ఏం ఇచ్చినా చూసీ చూడనట్టు దాటేస్తాడు.

మారుమూల పల్లెలో పుట్టి గోదారి లంక గ్రామం లో పెరిగిన శంకరశాస్త్రికి వారసత్వంగా వచ్చిన విద్య పౌరోహిత్యమే. ఆ పౌరోహిత్యం చేసుకునే ఇద్దరు కూతుళ్ళ పెళ్ళీ, పేరంటాలు, పురుళ్ళూ, పుణ్యాలూ కానిచ్చాడు. ఆ పౌరోహిత్యం తోనే నాలుగ్గదుల పెంకుటిల్లు అమర్చుకున్నాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకునూ తాహతుకు తూగనిదైనా ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్ లో చేర్చి చదివించాలని చూసాడు. ఒక్కో క్లాసు రెండేళ్ళు తప్పుతూ ఇరవై యేళ్ళు వచ్చినా పదో తరగతి గట్టెక్కలేకపోయాడు.

ఇహ తప్పక వాడికి నాలుగు మంత్రాలు నేర్పి వెంట తిప్పుకుని కన్న పాపానికి వాడికో బ్రతుకు తెరువు చూపించాడు. చదువంటే అబ్బలేదు గాని మాట చాతుర్యం ఎదుటివాళ్ళను ఆకట్టుకోగలిగిన సుబ్బు పౌరోహిత్యంలో

బాగానే ఎక్కివచ్చాడు. వచ్చీ రాని మంత్రాలకు మరిన్ని కథలు జోడించి, పిల్లలకోసం అంటూ , ఇంగ్లీషు, హిందీ ల్లో చెప్తూ ప్రస్తుత కాలానికి అన్వయిస్తూ మంచి పేరే తెచ్చుకున్నాడు.

అతని భార్య గవర్నమెంట్ స్కూల్ టీచర్. ఇద్దరు పిల్లలు. మంచి పేరున్న స్కూల్లో చదివిస్తున్నాడు. ఎక్కడెక్కడో స్థలాలూ పొలాలూ కొన్నాడని అంటారు. అతని భార్య ధనలక్ష్మి ఒంటినిండా నగలతో ధనలక్ష్మి లానే ధగధగలాడుతూ ఉంటుంది. పని మనిషి, వంట మనిషి దర్జాగా బ్రతికేస్తోంది.

"మనం కలిసి ఉండటం కుదరదు నాన్నా, పిల్లల గోలా, అల్లరీ మీకు సరిపడదు, వాళ్ళ చదువూ సంధ్యా సాగాలి. మా భారం కూడా మీకెందుకు ఉత్తరం వేపు గదులు రీమాడల్ చేసుకుని మేమక్కడ ఉంటాం" అని చెప్పినప్పుడు. పైకి ఏం అనలేకపోయినా మనసులో కుంగిపోయాడు. వయసు పై బడ్డాక కొడుకు నీడలో సేద దీరుదామనుకున్న ఆశలు అడియాసలయ్యాయి.

ఏమనగలరు? అందుకేనేమో– రాయంటి బిడ్డ లక్కంటి తల్లి అంటారు. అందుకే ఒక్కగానొక్క కొడుకు ఎక్కడున్నా సుఖంగా ఉండాలని అనుకుంటారు.

ఈ మధ్యన శంకర శాస్త్రి మంత్రాలు సరిగ్గా చదవలేకపోతున్నాడు. డెబ్బై ల్లోకి వచ్చాడు మరి. శరీరం సహకరించడం లేదు. ఏమీ తినకుండా అంతంత సేపు ఖాళీ కడుపుతో ఉండలేకపోతున్నాడు. అలాగని తిని వెళ్ళడానికి మనసొప్పడం లేదు.

దానికి తగ్గట్టూ ప్రతివాళ్ళూ సుబ్బునే కోరుకుంటున్నారు. చలాకీగా అందరినీ నవ్విస్తాడు. ప్రతిఫలం బాగానే డిమాండ్ చేసినా అతన్నే పిలుస్తున్నారు.

బాగానే ఉంది.

ఎంత ఇద్దరే అయినా ఆయన దాచుకున్న సొమ్మేమీ లేదు. బాధ్యతలు తీరాక రెక్కలు మాత్రమే మిగిలాయి. రోజువారీ ఖర్చులు, ఇంట్లో సరుకులకు మందులు కూడా తోడయాయి.

శకుంతలకు బీపీ, షుగరూ. తప్పకుండా మందులు వాడాలి. నెమ్మది నెమ్మదిగా పూజలకే వస్తానన్నది సడలించుకుని తద్దినాలకూ కర్మ కాండలకూ కూడా ఒప్పుకుంటున్నాడు.

కాని వాటికీ ఈవెంట్ ఆర్గనైనైజింగ్ అంటూ మొదలుపెట్టి పాకేజీలు మాట్లాడుకుని సహకరించిన వారికి ఆ పూటకు అయిదు వందలో వెయ్యో ఇస్తున్నారు. వద్దంటే అదీ దొరకదు.

కాని నెలకు అలాటి కార్యక్రమాలు ఎన్ని ఉంటాయి? ఒకటో అరో, పురుళ్ళూ, పుణ్యవచనాలూ కడుపు నింపేవా? కాలు నింపేవా?

వాళ్ళిచ్చే వందాయాభైలూ , పెద్దల పేరిట ఇచ్చే స్వయం పాకాలూ ... ఏదో రోజులు నెట్టుకొస్తున్నాడు.

ఒక్కోసారి నోరు తెరిచి కొడుక్కు చెబ్దామనిపిస్తుంది. ఇహ నా వల్లకాదు నువ్వే చూసుకోవాలని.

కాని ఆ మాట ఎత్తకముందే మిగతా సగం ఇంటికీ వలేసి కూచున్నాడు. పిల్లలు పెరుగుతున్నారనీ, సహం పోర్షన్ చాలడం లేదనీ, మొత్తం కలిపి పైనా కిందా కట్టుకోనివ్వమనీ.

అమ్మో. మొత్తం వాడి చేతుల్లో పెడితే ఇంకేమైనా ఉందా? కోడలు వంట మనిషినీ, పనిమనిషినీ మాన్పించి శకుంతలకు ఆ పనులు అప్పజెప్తుంది. కిందపోర్షన్ మాట దేముడెరుగు ఇద్దరికీ ఏ నడవానో వీధరుగో చూపిస్తారు. ఆడపిల్లలు ఓ పూట వచ్చే అవకాశమూ ఉండదు.

శకుంతల మందులు మరో రెండు రోజులే వస్తాయి. కొనడానికి డబ్బు కావాలి. నెల మొదట్లో దశ దానాల్లో ఒక స్వీకర్తగా పిలిచి ఇచ్చిన అయిదు వందలతో ఇన్ని రోజులూ నెట్టుకు వచ్చారు. ఈ ఆర్గనైజర్స్ కూడా మరీనూ పాకేజీ, పాకేజీ అంటూ మూడు నాలుగు లక్షలు వసూలు చేస్తారు. వెండి బంగారాలు వాళ్ళే తీసుకుంటారు. గోదానం అంటూ అయిదారువేలు తీసుకుని తమకు మాత్రం పంచెల చాపు అయిదువందలు ఇస్తారు.

పోనీ ఆ పంచెల చాపులే లుంగీలు , లంగాలు జాకెట్లుగా కుట్టుకుని సర్దుకుంటున్నారు.

రోజులు గడ్డుగానే నడుస్తున్నాయి.

ఆలోచనలో కొలిక్కి రాకముందే ఫోన్ మోగింది సన్నగా.

"హలో"

" శంకరం రేపొక ద్వాదశదిన కర్మ ఉంది పొద్దున్నే వచ్చేస్తావా? ఒకదానం నీకు ఇప్పిస్తాను?"

" వస్తాను శాస్త్రీ, కాని కొంచం డబ్బులు ఎక్కువిప్పించరాదా? బొత్తిగా మందులకూ మాకులకే చాలడం లేదు"

కొంచం దిగులు తీరి బేరానికి దిగాడు.

"ఎక్కడ శంకరం , నీకూ తెలుసుగా, మఠానికి అద్దె, కేటరింగ్ వాళ్ళకు వాటా, ఇవ్వాల్సినవన్నీ మనమే కొనాలి. అయినా ఏదో పరోపకారంగా నాకూ ఏమీ మిగిలిచావదు. అయినా నీ కొడుకు బాగానే సంపాదిస్తున్నాడుగా పెళ్ళి అంటే చాలు యాభైకి తక్కువ తీసుకోడు. నువ్విలా బీదరుపులు అరవడమేమిటీ? రేపు పదింటికల్లా వచ్చెయ్యి" అంటూ ఫోన్ పెట్టేసాడు.

నిస్సహాయంగా పెదవికొరుక్కున్నాడు శంకర శాస్త్రి.

ఒట్టి బీదరుపులు అరుస్తాడు అంతే. అన్నీ ఒకటి రెండ్లు సెట్లు కొని పెట్టుకున్నాడు. అవే అవే దానాలు ఇప్పిస్తాడు. ఎంత లేదన్నా ఒక్కో చావుకు లక్ష రూపాయలన్నా వెనకేసుకుంటాడు.

ఒక్కో సారి మనసు చివుక్కుమంటుంది. మృతుడి తాలూకు జనాలు నానా అప్పులూ చేసి తెస్తారు.

ఇది వాళ్లను దోచుకోడమేమో అనిపిస్తుంది కాని, తను కాదంటే మరొకరు వెళ్తారు. కాని తనకెలా రోజు గడవాలి?

పూజలూ , పుణ్యవచనాల నుండి నెమ్మదిగా ఇటు వేపు మళ్ళి పదేళ్ళు కావస్తోంది. ఎన్నో దానాలు అందుకున్నాడు. మొదట్లో కొంచం భయం వేసేది. ఆమృతుడి ఆత్మ వెనకాలే ఉన్నట్టనిపించేది. అదేమాట ఒకరిద్దరితో ప్రస్తావించాడు.

"పిచ్చి వాడా? నీకు పూజలు చేసి చేసి మైండ్ దొబ్బినట్టుంది. ఈ భూమ్మీద మనం ఉన్నామనేది నిత్యమూ సత్యమూ. మనకు కనిపించనివి ఉన్నాయంటే ఉన్నాయందాము. మనకు వచ్చిన నష్టం ఏమిటి?

పూజలు చేస్తాం ఆశీర్వదిస్తాము. మనసు కుదుటపడి తృణమో ఫణమో ఇస్తారు. మన ఆశీర్వాదమేం బ్రహ్మ వాక్కా? అదే నిజమై పోతుందా?

ఓ పక్కన హేతు వాదం ఎంత పెరుగుతోందో మూఢ నమ్మకమూ అంతకు రెండింతలు పెరుగుతోంది?

ఎవరైనా ఋషులను చూసారా? ఎవరైనా దేవతలను చూసారా? చూసామనుకునే భ్రమ తప్ప నిజం ఎక్కడుంది?

అసలు ఈ పూజలూ , మంత్రాలూ, నోములూ వ్రతాలూ రాసినదీ , నియమాలు పెట్టినదీ మనుషులేగా?

మనకు మంచి జరిగితే భగవంతుడున్నాడని నమ్ముతాము. చెడు జరిగితే వాస్తనీ గీస్తనీ, దయ్యాలనీ సవాలక్ష కారణాలు వెదుక్కుంటాము. అవన్నీ మనకెందుకు గాని, నాలుగు రాళ్ళు సంపాదించుకుని బతుకు వీలైనంత సజావుగా వెళ్లదియ్యడమే మన కర్తవ్యం" అంటూ హితబోధ చేసాడు.

అప్పట్నించి నిశ్చింతగా దానాలు తీసుకుని రోజులు గడిపేస్తున్నాడు.

పాపం శకుంతల, ఉన్నంతలో సర్దుకుపోతుంది కాని ఒక్కరోజూ ఇది ఉందని కాని లేదని కాని అనదు.

"రండి భోజనం వడ్డిస్తాను" పిలిచింది శకుంతల. రాత్రి ఏడున్నరయేసరికి తిని మంచం మీద వాలిపోయే వయసు.

బిక్కు బిక్కుమంటూ ఇద్దరూ వడ్డించుకున్నారు. శంకర శాస్త్రి కళ్ళలో నీళ్ళూ తిరిగాయి.

పెళ్ళైన కొత్తలో ఇంటినిండా మనుషులు. పెళ్ళి కావలసిన చెల్లెళ్ళు, పురిటికి వచ్చిన అక్కలు, సర్వం కోల్పోయి పుట్టిల్లు చేరిన మేనత్త, తల్లీ దండ్రీ, నాన్నకు చివరి క్షణం వరకు పసి వాడిలా అన్నం కలిపి తినిపించడం గుర్తుకు వచ్చింది.

ఇప్పుడీలా ఒకరి ఎదురుగా ఒకరు ముద్ద గొంతు దిగకపోయినా మింగాలి. మందులు వేసుకోవాలిగా?

" శకుంతలా , నాకేదైనా అయితే నువ్వెలా బతుకు తావు?" అడగాలనుకుని అడగలేకపోయాడు.

అవును, ఆ మధ్యన జబ్బు పడి ఆర్నెల్లపాటు ఎటూ వెళ్ళలేకపోయినప్పుడు శకుంతల పెళ్ళి వంటలకూ తద్దినం వంటలకూ వెళ్ళి రోజులు వెళ్లదీసింది.

కాని ఈ కర్మ కాండలకు ఎక్కడి నుండి తెస్తుంది? ఆ వంకన కొడుకు ఉన్న ఇల్లూ లాగేసుకుంటే అది రోడ్డున పడదూ?

చారన్నం పుల్లగా ఉన్నా చేదనిపించింది.

మజ్జిగ వద్దని చెయ్యి కడిగేసుకున్నాడు.

పడుకున్నా కునుకు రావడం లేదు. గుండెల్లో భారంగా ఉంది. అన్నట్టు రేపు కర్మకాండ జరిగే ఆ మనిషి గుండె జబ్బుతోనే పోయాడట.

తనకూ హఠాత్తుగా ...

" కాళ్ళకు కొంచం కొబ్బరి నూనె రాయనా? నిద్రపట్టడం లేదా, కాళ్ళు లాగుతున్నాయా? " శకుంతల అడిగింది.

“శకుంతలా, ఇటురా, "అంటూ పిలిచి మంచం పట్టి మీద కూచున్నాక,

"ఒక్క మాట శకుంతలా, చెప్తున్నానని కాదు గాని ఇద్దరం ఒకసారి పోలేం కదా, చివరి క్షణం వరకూ మనలో ఏ ఒక్కరు ఉన్నా తలదాచుకుందుకు కొంపకావాలి. కర్మకాండ, దానాలు అంటూ కొడుకు దాన్ని ఉండనివ్వడు. అప్పుడిక ఏ నడవాలోనో వీధరుగుమీదో బ్రతకాలి.

నువ్వు అమాయకురాలివి శకుంతలా, ఇవన్నీ ఒక వ్యాపారం. శరీరం విడిచి పెట్టాక మన చేసే ఏదీ ఆత్మకు చేరదు.

ఒక్క పని చెయ్యి, నా మృతదేహాన్ని ఏ హాస్పిటల్ కో దానం ఇచ్చెయ్యి, కాదూ కూడదంటే కరెంట్ దహనం చెయ్యండి కాని నా పేరిట నువ్వు వీధిన పడకు"

శకుంతల కళ్ళు తుడుచుకుంది.

ఆ మాటలు చెప్పాక శివ శంకరం సరిగ్గా వారం రోజులే ఉన్నాడు.

భర్త మాటలు కొడుక్కి చెప్పిచూసింది వినలేదు.

"చాల్లే , పిచ్చా, వెర్రా? ఈ పని చేస్తే నేనూ నాపిల్లలూ వీధిన పడాలి. ఉన్న ఉపాధి పోతుంది. " అని కసిరాడు.

నలుగురు పెద్దమనుషులను పిలిచి చెప్పబోయింది,

" నాన్న పోడంతో , అమ్మకు కొంచం మతి భ్రమించింది. ఆవిడ మాట పట్టించుకోవద్దు" అనేసాడు.

కనిపించని సంకెళ్ళు ఆమెను నమ్మకాలై బంధించాయి.

పదో రోజున తెల్ల వారకముందే దగ్గర్లో ఏటి ఒడ్డుకు తీసుకెళ్ళారు, కాని శకుంతల తిరిగి రాలేదు. ఏటి ఒడిలోకి నిశ్చింతగా సాగిపోయింది, నమ్మకాలకు బలిపశువుగా?

ఇంకెన్ని యుగాలు ఇలా గడవాలి? ఈ నమ్మకాల చీకటి గుహలో?

★★★

COMMENTS